


అగ్ని ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని బిజెపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు జరిగి అగ్నిప్రమాదంలో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బందలుప్పి నీలమ్మ (62) మంగళవారం ఉదయం కట్టెల పొయ్యి వెలిగించి వంట చేస్తుంది. ఆ సమయంలో ఆమెకు ఫిట్స్ వచ్చి పొయ్యి వద్దే పడిపోయింది. ఇది ఎవరూ గమనించకపోవడంతో ఆమెకు మంటలు అంటుకోవడంతో మేలువ వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. అప్పటికే ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆసుపత్రికి తీసుకు వెళ్లేసరికి ఆమె మరణించిందని స్థానికులు తెలిపారు. ఆమె పిల్లలు ఉపాధి కోసం వలస వెళ్లిపోవడంతో ఒక్కరే ఇంట్లో ఉంటుంది.

అంబరాన్నంటిన 'సంబరం'

- తరలివచ్చిన భక్తులు
- పోలమాంబను దర్శించుకున్న డిప్యూటీసిఎం
- బందోబస్తును పర్యవేక్షించిన ఎస్‌పి, ఎఎస్‌పి

ప్రజాశక్తి-మక్కువ

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి జాతర అంబరాన్ని తాకింది. లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య సిరిమాను సంబరం వైభవంగా జరిగింది. మంగళవారం మధ్యాహ్నం స్థానిక చదురుగుడి నుండి అమ్మవారి ఘటాలను మేళతాళాల నడుమ సిరిమాను వద్దకు తోడ్కొని వచ్చారు. పూజలు అందుకున్న అనంతరం 3.45గంటలకు పూజారి జన్నిపేకాపు రామారావు మేళ తాళాల నడుమ సిరిమానును అధిరోహించారు. తొలుత గరుడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న సిరిమాను తరువాత సావిడి వీధిలోని మునసబు ఇంటి వద్ద పూజలు అందుకొని ముందుకు సాగింది. పటిష్ట పోలీసు బందోబస్తు, రోప్ పార్టీ నడుమ సినిమాను ఊరేగింపు చేపట్టారు. ప్రధాన రహదారి నుండి ఎస్‌సి కాలనీ, పనుకువీధి, గొల్లవీధి, కాలనీ పనుకు వీధి గొల్ల వీధి కొండవీటి ఎస్సీ హాస్టల్ సమీపం నుండి తిరిగి భక్తులు పూజలు అందుకుని చావిడివీధి వరకు సాగింది. అనంతరం అమ్మవారి ఘటాలను గద్దెవద్ద ఉంచారు. అనుకున్న సమయానికి 45నిముషాలు ఆలస్యంగా ప్రారంభమైన సిరిమాను సంబరం 5.30గంటలకు ముగిసింది. గత రెండేళ్లుగా కరోనా కారణంగా జాతరకు దూరంగా ఉన్న జనం ఈఏడాది సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు.

సిరిమాను సంబరాన్ని పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్ దగ్గరుండి పర్యవేక్షించారు. డిఎస్‌పిలు సుభాష్, హర్షిత చంద్రకు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. సిరిమానుకు రోప్ పార్టీ, పోలీస్ సిబ్బందితో రక్షణ వలయంగా ఏర్పడి ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు.



శంబర వీధుల్లో ఊరేగుతున్న సిరిమాను



అమ్మవారికి మొక్కు చెల్లిస్తున్న భక్తురాలు

జాతరను సందర్శించిన విజయనగరం ఎస్‌పి

సంబర పోలమాంబ అమ్మవారి సినిమానోత్సవాన్ని విజయనగరం జిల్లా ఎస్‌పి దీపికా పాటిల్ మంగళవారం సాయంత్రం సందర్శించారు. జాతర విజయవంతంగా సాగేందుకు తీసుకున్న చర్యలను ఆమెకు అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్‌ను డిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు

అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సిఎం

పోలమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం రాజన్న దొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, సాలూరు మాజీఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ దర్శించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు డిప్యూటీ సిఎంకు ఘన స్వాగతం పలికారు అనంతరం రాజన్నదొర జాతర ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు.



పోలమాంబ దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



డిప్యూటీ సిఎం రాజన్నదొరకు స్వాగం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు



ఎఎస్‌పి, డిఎస్‌పిలతో చర్చిస్తున్న విజయనగరం ఎస్‌పి దీపిక



ఉరితాళ్లు మెడకు బిగించుకొని నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలంటూ

రైతుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - సీతానగరం

తమ ధాన్యం కొనుగోలు చేయాలంటూ మండలంలోని అంటిపేట రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం అంటిపేట, రెడ్డి వానివలస గ్రామాలకు చెందిన రైతులు ఉరితాలు మెడకు బిగించుకుంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఈనెల 7న రైతులతో ఆందోళన చేసిన సందర్భంలో రైతుల వద్దనున్న మొత్తం ధాన్యాన్ని సేకరించి కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చి నేటి వరకూ అమలు చేయలేదని అన్నారు. గ్రామానికి చెందిన 20మంది రైతులు 5వేల బస్తాలు ధాన్యం రైతు భరోసా కేంద్రం వద్దనే ఉన్నాయని, తరలించకపోవడంతో రాత్రీ, పగలు రైతులు వాటిని కాపలాకాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇటీవల కాలంలో వరి కుప్పలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయని, కావున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. సిపిఎం మండల కన్వీనర్ రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ అధికారులు వచ్చి హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదని అన్నారు. ఒక్క గింజ రైతుల వద్ద ఉంచకుండా నేరుగా కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో రైతులు ఆందోళన బాటపడుతున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించకపోతే ఈనెల 27 నుంచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఫోన్లో సివిల్ సప్లై డిఎంతో మాట్లాడగా, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, రైతులు పైల సింహాచలం, బి.భారతి, పైల గణపతి నాయుడు, పైల ఈశ్వరరావు, చలపతి, అప్పలస్వామి, కోట అప్పలస్వామి, పాటు పలువు రైతులు పాల్గొన్నారు.

సెమీఫైనల్‌కు చేరిన విజయనగరం బాలికల జట్టు

విజయనగరం టౌన్, నెల్లిమర్ల

నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్ 17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజయనగరం బాలికల జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం సాయంత్రం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మొదటి రౌండ్ లో బాలుర విభాగంలో చిత్తూరు- విశాఖపట్నం జట్లు మధ్య జరిగిన మ్యాచ్ లో విశాఖ, శ్రీకాకుళం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో శ్రీకాకుళం జట్టు విజయం సాధించాయి.

ఇ- పంట నమోదు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

వ్యవసాయ శాఖలో రబీ పంటకు సంబంధించి ఇ-పంట నమోదు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో మంగళవారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, బిందుసేద్యం శాఖల్లో అమలతున్న పథకాల పురోగతిని కలెక్టరు సమీక్షించారు. నిర్ణీత సమయంలో లక్ష్యాలు పూర్తి చేయాలని, ఇ-పంట నమోదు, పిఎంకిసాన్- ఇకెవైసీ నమోదులో అత్యల్ప పనితీరు కనబర్చిన మండల వ్యవసాయ అధికారుల నుంచి వివరణ కోరాలని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఇ-పంట నమోదు, పిఎం కిసాన్- ఇ కెవైసి ప్రక్రియను గురువారం నాటికి పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల పనితీరును క్రోడీకరించేందుకు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ యాప్ నందు 15రోజుల్లో పూర్తి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఖరీఫ్ ధాన్యం ఇప్పటి వరకు 6,500 టన్నుల మిగులు ధాన్యం కొనుగోలు చేసేందుకు యాప్ నందు నమోదు చేశామని, ఇ-క్రాప్ నమోదు చేసి మిగిలిన ధాన్యం ఉంటే వాటి వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు. మిగులు ధాన్యం సేకరణలో ఇతరుల ధాన్యం నమోదు చేస్తే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులపై చర్యలు తీసుకుంటామని కలెక్టరు హెచ్చరించారు. మత్స్యశాఖకు సంబంధించి జనవరి నాటికి 42యూనిట్లు లక్ష్యం కాగా, 33 యూనిట్లకు రుణాలు మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన యూనిట్లకు కూడా వెంటనే రుణం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బిందు సేద్యానికి సంబంధించి తమ వాటా చెల్లించిన రైతులకు వెంటనే యూనిట్లను మంజూరు చేసి, గ్రౌండింగు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ జెడి కె.రాబర్ట్‌పాల్, జిల్లా ఉద్యాన అధికారి కెఎస్ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య అధికారి వేమూరి తిరుపతయ్య, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎ.ఈశ్వర రావు, జిల్లా సూక్ష్మ నీటి అధికారి ఎల్.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిలర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గృహ సారధుల జాబితా సిద్ధం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో గృహ సారధుల నియామకాన్ని ఈనెలాఖరుకు పూర్తి చేయాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి 50ఇళ్లకు ఇద్దరు గృహ సారధులను నియమించనున్నట్లు చెప్పారు. పార్టీ ముఖ్యకార్యకర్తల పేర్లను సారధులుగా సిఫార్సు చేయాలన్నారు. భవిష్యత్‌లో పార్టీకి, ప్రభుత్వానికి వారధులుగా గృహ సారధులతో పాటు సచివాలయం కన్వీనర్లు వ్యవహరిస్తారని చెప్పారు. వార్డు, గ్రామాల స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధిష్టానం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గృహసారధుల నియామకానికి సంబంధించి పేర్లను వీలైనంత త్వరగా అందజేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, బి.శ్రీనివాసరావు, రాపాక మాధవరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ,పి.అప్పలస్వామి,బి.బాలకష్ణ పాల్గొన్నారు.

కాలువల ఆధునికీకరణ పూర్తయ్యేనా?

ఆరేళ్లుగా సాగునీరందక నష్టపోతున్న రైతాంగం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పాలకులు, పార్టీలు మారినా తోటపల్లి ఎడమ కాలువ రైతుల తలరాతలు మారలేదని జిల్లా ఏరువాక సభ్యులు కె.ప్రసాదరావు, రైతు సీమల హరికృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అనేక ఏళ్లుగా తోటపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ దిగివనున్న 54వేల ఎకరాలకు సాగునీరందక రైతులు లక్షలాది రూపాయల పంట నష్టపోతున్నారన్నారు. 2018లో పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువలకు రూ.193 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకరణ పనులను చేపట్టి ఐదేళ్లు అవుతున్నా అరకొర నిధులు విడుదల చేయడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. దీనివల్ల ఏటా అంచనా వ్యయం పెరగడం వల్ల రూ.250 కోట్లుకు పైగా వెచ్చించాల్సి వచ్చిందని అన్నారు. నిధులు ఒకసారి విడుదల చేసి ఆరు కిలోమీటర్లు ఒక ప్రాజెక్టు చొప్పున నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపడితే ఆ ఏడాది పని పూర్తవ్వడమే కాక రైతులు పంట నష్టం వాటిల్లకుండా రెండు పంటలకు సాగు నీరందేదని, బిక్షం వేసినట్లు అరకొర నిధులు విడుదల చేయడం వల్ల పని ఆలస్యం వల్ల జన వనరుల శాఖపై రైతులు విరుచుకుపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రాధాన్య రంగమైన వ్యవసాయ రంగాన్ని విస్మరించి విశాఖ వద్ద కొండపైన శారదా పీఠానికి జనావాసం లేని పరిసర ప్రాంతాలకు రూ.1.75 కోట్ల పిఎంవైఆర్‌డిఎఏ నిధులతో రోడ్డు వేస్తున్నారని, ఇది ప్రజాధనం దుర్వినియోగం కాదా అని ప్రశ్నించారు. వేలాది మంది రైతుల జీవనాధారమైన తోటపల్లి ఆధునీకరణకు నిధుల అరకొరగా ఇవ్వడం సరికాదని, శారదా పీఠాన్ని అభివృద్ధి చేయడం వల్ల ఆధునీకరణ పనులను విస్మరిస్తే రైతులు ఆగ్రహానికి గురవుతారన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెూరెత్తి చాటుతున్నాయని, అవగాహన లేని సలహాదారులను నియమించుకోవడం వల్ల వారు ఇచ్చిన సలహాలతో ప్రజలు ఆగ్రహానికి గురి అవుతున్నారని హెచ్చరించారు.



గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రణాళికాబద్ధంగా గృహ నిర్మాణాలు

ప్రజాశక్తి - కొమరాడ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, అందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అదేశించారు. మండలం గృహ నిర్మాణాలపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులుతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వేగవంతం కావాలన్నారు. అందుకు అవసరమైన గృహ నిర్మాణ సామగ్రి ముందుగా సమకూర్చుకోవాలని సూచించారు. కొరతగా ఉన్న సామగ్రిపై దృష్టి సారించాలని, వాటిని వెంటనే సేకరించాలని అన్నారు. లబ్దిదారులను గృహ నిర్మాణంపై ఎప్పటికప్పుడు సంసిద్ధులను చేయాలని సూచించారు. ఈ నెలాఖరుకు ప్రగతి స్పష్టంగా కనిపించాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో సౌకర్యాలు సమకూర్చాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి లబ్దిదారులను సమాయత్తం చేయాలని సూచించారు. మండలంలోని ఇంజినీరింగ్ సహాయకులు పూర్తి శ్రద్ధ వహించాలని, లక్ష్యాలను సాధించాలని ఆయన చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ డిఇ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ముఖ హాజరు మినహాయించాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మున్సిపల్ వర్కర్లకు ముఖహాజరు విధానాన్ని మినహాయించాలని కోరుతూ మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మొబైల్ ఫోన్లలో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. పట్టణ విస్తరణ రోజురోజుకు పెరుగుతుందని, భౌతిక పరిస్థితిని పరిశీలించి సంపూర్ణ పారిశుధ్య నివారణకు జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఇఎస్‌ఐ ప్యానల్ క్లీనిక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. 2022 డిసెంబర్ నెల జీతాల బకాయిలు, హెల్త్ అలవెన్స్‌లు తక్షణమే చెల్లించాలన్నారు. సబ్బులు, చెప్పులు, గ్లౌజులు, యూనిఫాం కుట్టుకూలి చెల్లించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.రాము, పడాల భాస్కరరావు, సిహెచ్ సంజీవు, పడాల వేణు, చింతల సురేష్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

పూర్ణపాడు- లాబేసు వంతెన పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - కొమరాడ

దీర్ఘ కాల సమస్యగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు ప్రారంభించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఈ వంతెను ఆయతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో తొమ్మిది పంచాయతీల పరిధిలో గల 65 గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ వంతెన 14 ఏళ్లుగా అసంపూర్తిగా వదిలేశారన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ కృష్ణాజీ ఎంతో శ్రమించి నిధులు విడుదల చేసి కాంట్రాక్టర్ రప్పించి పనులు పున ప్రారంభించి 2023 జూన్ కల్లా వంతెన పనులు పూర్తిచేస్తామని చెప్పారన్నారు. అయితే ఆ దిశగా కాంట్రాక్టరు పనులు ప్రారంభించి కేవలం ఆరు రోజులే చేసి ఆ తర్వాత పండగకు ఇంటికి వెళ్లి వారు నేటికీ రాలేదన్నారు. పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించక పోవడం అన్యాయమన్నారు. ఈ వేసవిలో నదిలో పనులు ప్రారంభిస్తే వర్షాకాలం వచ్చేసరికి పూర్తయ్యే పరిస్థితి ఉందన్నారు. కాలయాపన చేస్తూ పనులు చేస్తే అసంపూర్తిగానే ఉంటాయన్నారు. కావున వెంటనే పెండింగ్ ఉన్న నిధులు విడుదల చేసి కాంట్రాక్ట్‌ను రప్పించి వంతెన పనులు వేగవంతం చేసి ఈ వేసవికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

అజెండా ఆధారంగా సమావేశాలు

వీరఘట్టం : స్వయం శక్తి సంఘాలకు ఎజెండా ఆధారంగా సమావేశాలు నిర్వహించాలని ఇన్‌ఛార్జి ఏరియా కోఆర్డినేటర్ బి.నారాయణరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో సీసీలు, వివోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వయంశక్తి సంఘాల బలోపేతానికి యాక్షన్ ప్లాన్ ఎంతో అవసంమని, ఆ విధంగా ప్రణాళికలు వేసుకుని సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్త్రీ నిధి 10శాతం వసూలైందని, మార్చి నెలాఖరుకు శత శాతం వసూళ్లు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసు కోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఎం జి.శివున్నాయుడు, మండల మహిళసమైక్య అధ్యక్షులు పి,సుజాత సిసిలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గడపగడపనకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అవగాహన ఉండాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పంచాయతీలో మంజూరైన అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంజూరైన పనులను ఏ విధంగా చేయించాలి, పనులు చేసేటప్పుడు తీసుకోవాల్సిన నియమ నిబంధనలు వివరించారు. సర్పంచుల సహకారంతో పనులు చేపట్టాలన్నారు. పనుల పర్యవేక్షణ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లే దగ్గరుండి చూడాలన్నారు. పంచాయతీలో సమర్థవంతమైన వ్యక్తితో పనులు చేయించాలని అప్పుడే పనులు వేగవంతమయ్యేందుకు వీలుంటుందని అన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో 789 పనులు కోసం రూ.18 కోట్ల 71 లక్షలు కేటాయించడం జరిగింది అన్నారు. ఇందులో పంచాయతీరాజ్ కు రూ.6.90కోట్లు రాగా, ఆర్‌డబ్ల్యుఎస్‌కు మరో రూ.6.90 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. సమావేశంలో ఎంపిపి దీనమయ్య, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.రాధిక, మండల పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఎఇ మురళీధర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఎస్ఇ కృష్ణాజీ


వైవి సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న రాజశేఖర్ కుటుంబ సభ్యులు

పాలవలసను కలిసిన వైవి సుబ్బారెడ్డి

పాలకొండ: జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, వైసిపి నాయకులు పాలవలస రాజశేఖరంను టిటిడి ఛైర్మన్, ఉత్తరాంధ్ర వైసిపి సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పలు అంశాలపై చర్చించారు. స్థానిక రాజకీయాలతో పాటు జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై కూడా చర్చించుకున్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి సహకరించాలని రాజశేఖరంతో పాటు ఎంఎల్సి విక్రాంత్ కోరారు. వీరితో పాటు విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, పాతపట్నం ఎంఎల్ఎ రెడ్డి శాంతి, నగర పంచాయతీ ఛైర్పర్సన్ యందవ రాధాకుమారి తదితరులున్నారు.


ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఆర్జెడి జ్యోతికుమారి

శత శాతం ఫలితాలు సాధించాలి


పార్వతీపురం రూరల్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శతశాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని విద్యాశాఖ ఆర్జెడి జ్యోతి కుమారి అన్నారు. మండలంలోని పెదబొండపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె టెన్త్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నోట్సులను సక్రమంగా దిద్దాలని, వర్క్ బుక్‌లను ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థులను తీర్చి దిద్దాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు, నల్ల తిరుపతి నాయుడు, ఎంఇఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కండి

బలిజిపేట : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ఢిల్లీ రైతు ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాల్లో ట్రాక్టర్ల ర్యాలీలు జరపాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెలు సత్యనారాయణ పిలుపునిచ్చారు మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని జిల్లాల్లో ఉమ్మడి సమావేశాలు జరుపు కొని కార్యక్రమం రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమం విజయంతానికి విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు బలగా సత్యనారాయణ, రైతు కూలి సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి నిధులకు కోత అన్యాయం

గుమ్మలక్ష్మీపురం : ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టం గడువును మరో పదేళ్లుపెంచామని గొప్పలు చెప్పుకొనే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్‌లో పూర్తిగా కోత పెట్టడమే కాకుండా ఇచ్చిన నిధులు కూడా నవరత్నాలకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు నందివాడ కృష్ణబాబు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్ర జనాభాలో 16.4 శాతం ఎస్‌సిలు, 5.3 శాతం ఎస్‌టిలు ఉన్నారని, అయితే ఈ మూడేళ్లలో ఎస్‌సి లకు సంబంధించి రూ.16 వేల కోట్లు, ఎస్‌టిలకు సంబంధించి రూ.4 వేల కోట్లు బడ్జెట్‌లో కోత విధించడం అన్యాయమని అన్నారు. బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు ఖచ్చితంగా కేటాయించాల్సిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు కూడా ప్రభుత్వం స్వాహా చేస్తే ఎస్‌సి, ఎస్‌టిలు ఏ విధంగా అభివృద్ధి చెందుతారని ప్రశ్నించారు. ఎస్‌సి కార్పొరేషన్, ఐటిడిఎను నిర్వీర్యం చేశారని ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాదించలేదని హెచ్చరించారు.


పురుషోత్తమనాయుడును సత్కరిస్తున్న ఎపి ఎన్జీవో సంఘ నాయకులు

పురుషోత్తమనాయుడుకు సత్కారం

పాలకొండ : ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర సహాయ అధ్యక్షులుగా ఐదో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన చౌదరి పురుషోత్తమనాయుడును సోమవారం స్థానిక ఎన్‌జిఒ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ గౌరవ అధ్యక్షులు లీలీపుష్పనాథం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న పురుషోత్తమనాయుడుకు ఈ గౌరవం దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె.రంగాచారి, ప్రధాన కార్యదర్శి పైల ఈశ్వరరావు, సహాయ అధ్యక్షులు జె.రమేష్‌కుమార్ ఉన్నారు.

అయోడిన్ ఉప్పును వాడాలి

పార్వతీపురం రూరల్ : అయోడిన్ ఉన్న ఉప్పును వినియోగించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మూడో దశ అయోడిన్ డెఫిషియన్సీ డిసార్డర్స్ సర్వే బందలుప్పి పిహెచ్‌సి పరిధి అడ్డాపుశీల హెల్త్ వెలెనెస్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 30 పిహెచ్‌సిల పరిధిలోని పాఠశాలల్లో 6 – 12 ఏళ్ల వయసు గల 90 మంది పిల్లలకు థైరాయిడ్ గ్రంథి తనిఖీ చేశామన్నారు. ఆహారం ద్వారా తీసుకుంటున్న ఉప్పులో అయోడిన్ శాతం పరీక్ష చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కర రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డా వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డిఎల్‌డిఒ విచారణ

పార్వతీపురం రూరల్ : మండలంలోని పెద్దమరికి పంచాయతీకి సంబంధించి నిధుల దుర్వినియోగంపై త్వరలోనే డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేపట్టనున్నట్లు ఎంపిడిఒ అఖిబ్ జావేద్ చేపట్టనున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ సర్పంచ్ కార్యదర్శి కలిసి పరిమితి మించి నిబంధనలకు వ్యతిరేకంగా నిధులు దుర్వినియోగం చేసినట్లు తమ పరిశీలనలో వెల్లడైందని, విషయాన్ని పై అధికారులకు నివేదించగా డిఎల్‌డిఒ విచారణ ద్వారా నిర్ధారణ చేయనున్నారని ఆయన తెలిపారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

వీరఘట్టం : వేతనదారుల సంఖ్య పెంచేందుకు చొరవ చూపాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కంబర–బుడ్డిడి గ్రామాల మధ్య జరుగుతున్న వ్యవసాయ కాలువ పనులను పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 2964 మంది వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొన్నారని, మరింత వేతన దారులసంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. రెండు పూటలా పని కల్పించాలని ఎపిఒ జి.సత్యంనాయుడును ఆదేశించారు. కనీస వేతనం రూ.220 వచ్చేలా చూడాలన్నారు. టిఎలు ,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

పాలకొండ రూరల్ : రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాలరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లాల్లోని ధాన్యం పరిశీలన

సీతానగరం : మండలంలోని కాశీపేట, అంటిపేట గ్రామాల్లోని కళ్లాలోని గల ధాన్యాన్ని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ సోమవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఒక యాప్ ఇచ్చిందని, దీని ద్వారా కళ్లాల్లోనే ధాన్యాన్ని రైతుల ఫోటో అప్లోడ్ చేసుకుంటే ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. వెంటనే రైతులు కల్యాణి ఆ యాప్‌లో అప్లోడ్ చేయించుకోవాలని కోరారు.

బాలికలు జాతీయ సంపద

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమాజంలో బాలబాలికలు ఇద్దరూ సమానమేనని, బాలికలు జాతీయ సంపదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. బాలికలు లేని ఇల్లు ఆనందాల హరివిల్లు కాదని ఆయన పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలబాలికలు ఇద్దరూ సమానమేనన్నారు. అపోహలు, సామాజిక రుగ్మతలను అనుసరించే వారు బాలురకు పెద్ద పీట వేయడం జరుగుతోందని ఆయన చెప్పారు. కుటుంబ బాధ్యతలు నిర్వహణలోనూ, వివిధ రంగాల్లో రాణించడంలో బాలికలు ఎవరికీ తీసిపోరని అన్నారు. ఆధునిక కాలంలో ఉన్నత పదవులు పొందుతూ చక్కని పాలనను అందించడంలో అందెవేసిన చేయిగా ఉన్నారని, అంతరిక్షం, రక్షణ, పోలీస్ శాఖల్లోనూ అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శిస్తూ ఔరా అనిపించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. చదువుల్లో గణితం, ఇతర శాస్త్రాల్లో మంచి ప్రతిభ చూపుతున్నారని ఆయన చెప్పారు. బాలికల ఆవశ్యకతను సమాజం గుర్తించాలని, అపోహలు విడిపెట్టాలని కోరారు. సమాజంలో అసమతౌల్యం ఉండరాదని, అది అనార్థాలకు దారి తీస్తుందని ఆయన చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో బాలబాలికల నిష్పత్తిలో విపరీతమైన వ్యత్యాసాలున్నాయని వివరించారు. బాలబాలికలు ఇద్దరూ సమానమే అనే భావం అందరిలోనూ రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనేక కుటుంబాలకు ఆడ పిల్లలు అండగా నిలుస్తున్నారనే సత్యాన్ని మరువరాదని ఆయన చెప్పారు. కుటుంబాలకు మార్గదర్శత్వంలో మహిళలది అందేసిన చేయి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలికా పరిరక్షణ ప్రతిజ్ఞను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, ఇన్‌ఛార్జి డెప్యూటీ డి.ఎంహెచ్ఒ డాక్టర్ వినోద్, ఇన్‌ఛార్జ్ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : బాలికా విద్యతోనే ఏదైనా సాధ్యమవుతుందని మండలంలోని మారిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామల సింహాచలం అన్నారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముందుగా సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంట్ శ్రీలక్ష్మి సహకారంతో బాలికలకు అవసరమైన రిబ్బన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు ప్రేరణ కలిగించేలా వివిధ రంగాల్లో పేరు సంపాదించిన ఇందిరాగాంధీ, సావిత్రిబాయి పూలే, ఝాన్సీ లక్ష్మీబాయి, పివి సింధు, కోనేరు హంపి, సానియా మీర్జా, హిమదాస్, మేరీకోం, మిథాలీరాజ్ తదితర దేశ మహిళా నాయకులు, క్రీడాకారుల జీవిత విశేషాలు, సాధించిన లక్ష్యాల గురించి వివరించారు. మహిళలు పురుషులతో సమానంగా నేడు అన్ని రంగాల్లో అగ్ర స్థానంలో ఉన్నారని, విద్యతోనే ఏదైనా సాధ్యమని ఉద్బోధించారు. బాలికలు చదువుకోవడం ద్వారా సమాజం చైతన్యవంతమవుతుందన్నారు. కావున బాలికలంతా ఉన్నత చదువులు చదువుకుని ముందుకు దూసుకెళ్లాలని బాలికలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.సుధాకర్, బాల బాలికలు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : బాలికలు, మహిళలు పట్ల జరుగుతున్న వివక్షత కార్యక్రమాలకు వ్యతిరేకంగా చైతన్యకార్యక్రమాలు చేపట్టాలని జనచేతన కార్యదర్శి, ఎపి ప్రో ఛైల్డ్‌గ్రూప్ రీజినల్ కన్వీనర్ బగాది శోభాకుమారిచౌదరి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జనచేతన ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్య, బాల్యవివాహాలు, బాలకార్మికులు, విద్యాహక్కు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం రేణుకాచౌదరి మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న వివక్షత, హింసలను ఎదుర్కోవాలంటే ముందుగా చైతన్య పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాలికలకు చైల్డ్ రైట్స్‌పై క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, లత, కామేశ్వరి, ప్రభావతి, కృష్ణకుమారి, సుగుణకుమారి, శ్రీదేవి, రమాకుమారి, ఉష, రత్నం, జనచేతన కోఆర్డినేటర్ ఎం.సరస్వతి తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎపి ప్రోఛైల్డ్ గ్రూపు రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.


పార్వతీపురంటౌన్ : విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

భామిని : మండలంలోని కొసలి పంచాయతీ పరిధిలో సెక్రటరీ ఎం.మహేంద్ర ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. బాలికలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం అంటూ ఎంపిపి స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నేటి బాలికలే భవిష్యత్తు తరాల అమ్మలని అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు స్వేచ్ఛగా బతకడానికి చట్టాలు ఉన్నాయని, అన్నీ రంగాల్లోనూ ఆడపిల్లలు సత్తా చాటుతున్నారని అన్నారు. ఇంటికి ఆడపిల్ల ఆభరణమని, ప్రస్తుతం ఆడపిల్లలే తల్లిదండ్రులకు, వృద్ధులకు బాసటగా నిలుస్తున్నారన్నారు. ఆడపిల్లలంటే భయం కాదని, కుటుంబానికి బలం అని కొసలి సర్పంచ్ మజ్జి మోహనబాబు అన్నారు. జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా స్థానిక సచివాలయంలో బాలికలు మజ్జి మేఘన సర్పంచ్‌గా, కంబాల ఉపాసన పంచాయతీ సెక్రటరీ గా, మిగిలిన బాలికలు సచివాలయం వివిధ శాఖలు సిబ్బందిగా వ్యవహరించారు.

కెజిబివిలో...

స్థానిక కెజిబివి పాఠశాలలో ఎస్ఒ బి.శారద ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఒ మాట్లాడుతూ, నేటి సమాజంలో ఆడపిల్లలు కుటుంబానికి భారం కాదని, భరోసా అని, అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. కార్యక్రమం లో పాఠశాల సిబ్బంది వున్నారు.

లక్ష్మీపురంలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు నిర్వహించారు. అనంతరం చిన్న వీధి వద్ద నుంచి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేసి వారు ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలన్నీ సవ్యంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. వారికి అర్హత ఉండీ ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందలేకుంటే వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో విద్యా ప్రమాణాల మేరకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూర్‌కమార్ అన్నారు. మండలంలో ఆయన మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని ఇరిడి పంచాయతీ పరిధిలోని తోలుఖర్జలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువులో ఏ మేరకు పట్టు సాధించారో తెలుసుకునేందుకు విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచి కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. గిరిజన విద్య కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని, ప్రతి ఒక్కరూ సక్రమంగా పాఠశాలకు వచ్చి


విద్యార్థులచే పాఠాలు చదివిస్తున్న సబ్‌కలెక్టర్

విద్యాబుద్ధులు నేర్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి బడికి వచ్చేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో విద్యా బోధన చేయించాలన్నారు. అనంతరం ఇరిడి, లుంబేసు, గంద్ర గ్రామాల సమీపానున్న భూములను రీసర్వే చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కలెక్టరేట్ : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిఆర్ఒ, ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణపై ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఆర్‌సిఎం (జిల్లా కార్యాలయాల సమూహం) కాంప్లెక్స్‌లో కార్యక్రమం జరగనుందని చెప్పారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. కళాశాల విద్యార్థుల బృందాలకు ఓటరు దినోత్సం భావనపై రంగోలి పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రంగోలిలో పాల్గొనే విద్యార్థి బృందాలు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఓటింగ్‌లో ఇవిఎం పాత్ర, పోలింగ్ బూత్ తదితర ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ముగ్గులు వేయాలని ఆమె సూచించారు. వేదిక వద్ద సెల్ఫి పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఓటరు ప్రతిజ్ఞ, ఉత్తమ బూత్ స్థాయి అధికారులకు ప్రశంసా పత్రాలు పంపిణీ, యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ, సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

పది పంచాయతీల్లో వాటర్ షెడ్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని 10 పంచాయతీలకు గానూ 7 మైక్రో వాటర్ షెడ్లు మంజూరయ్యాయని ఎంపిపి కె.దీనమయ్య తెలిపారు. 4728 హెక్టార్ల విస్తీర్ణంతో రూ.10.61 కోట్లతో ఏడాది కాలపరిమితితో మంజూరయ్యాయ్యాయన్నారు. వాటర్ షెడ్ ప్రవేశిక కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యం పెంపొందించి, ఈ పథకంపై వారిలో నమ్మకం, సత్సంబంధాలు పెంపొందించేందుకు వాటర్‌షెడ్ కార్యక్రమాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సామూహికంగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.21.22లక్షలు కేటాయించారన్నారు. ఎల్విన్‌పేట వాటర్షెడ్ మైక్రో వాటర్షెడ్‌లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు గానూ నీటికి సంబంధించిన వాటర్ ట్యాంక్‌ను ఆయా ప్రజాప్రతినిధులు, ప్రజలతో గుర్తించిన పనికి రూ 1.70 లక్షలు మంజూరైందన్నారు. ఈ పనిని ప్రజాభాగస్వామ్యంతో వినియోగించుకోవాల్సి ఉంది. కార్యక్రమంలో వైస్ ఎంపిపి, జెడ్పిటిసి సభ్యులు, సర్పంచ్‌లు వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని భూ రీసర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ చందక సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విఆర్ఒల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలయాపన చేయకుండా నిర్దిష్టంగా భూ రీసర్వేపై శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. అలాగే వివిధ రకాల ధ్రువపత్రాలకు సంబంధించి అర్జీదారులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావుతో పాటు విఆర్ఒలు పాల్గొన్నారు.

హడ్డుబంగి , పులిపుట్టి సచివాలయాలు సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిపుట్టి, హడ్డుబంగి సచివాలయాలను డిఎల్‌డిఒ వివి గోపాలకష్ణ సందర్శించారు. వీలైనంత ఎక్కువగా ప్రజలకు సేవలందించాలన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వాలంటీర్లను ఆదేశించారు. సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపిడిఒ కె.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సంవత్సరం

ప్రజాశక్తి - సీతంపేట

అనకాపల్లిలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 సమావేశం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆర్ట్స్ సంస్థ, నాబార్డ్ సహకారంతో మంగళవారం నిర్వహించారు. మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీకి చిరు ధాన్యాలు సాగులో ఉత్తమ రైతు ఉత్పద్దాల కంపెనీ అవార్డును చీఫ్ జనరల్ మేనేజర్ పి.గోపాల్ నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ రీజనల్ ఆఫీసర్ శ్రీనివాస్‌బాబు, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.శంకర్రావు మాట్లాడుతూ ఈ కంపెనీ 1329 మంది రైతులతో పైనాపిల్, పసుపు, జీడి, చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, సామలు పంటలను పండించి వాటి ద్వారా విలువ ఆధారిత వస్తువులు చిరుధాన్యాల బిస్కెట్లు, పొడర్లు రకరకాల ఉత్పత్తులు తయారు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే చిరుధాన్యాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దీనికి సహకరించిన వ్యవసాయ శాఖ, ఐటిడిఎ సీతంపేట వారికి సాంకేత సహకారం అందించిన ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ నూక సన్యాసిరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్నేహితులతో సరదాగా ఏర్పాటు చేసిన దోస్త్ మేరా దోస్త్ గ్రూపు సభ్యుల సహకారంతో చిన్న చిన్న సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని సర్పంచుల సంఘం అధ్యక్షులు, స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకరరావు అన్నారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలోని 50మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరరా ఆయన మాట్లాడుతూ దోస్త్ మేరా దోస్త్ గ్రూపు ద్వారా కరోనా సమయంలో ప్రజలకు సేవలు చేస్తున్నామన్నారు. పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ, గ్రూపు సభ్యుల్లో ఎవరికైనా కష్టం వస్తే వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. అనంతరం దోస్త్ మేరా దోస్త్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్ మాట్లాడుతూ పేదలకు ఎటువంటి కష్టం వచ్చినా గ్రూపు సభ్యులు ముందుండి సహాయ సహకారాలు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్తకోట కిషోర్, దోస్త్ మేరా దోస్త్ సెక్రటరీ కొణిశ సూర్యం, వర్తక సంఘ అధ్యక్షులు కొత్తకోట విష్ణు, ఉపాధ్యక్షులు మజ్జి ప్రసాద్, కాపు సంఘ అధ్యక్షులు కొణిశ మన్మధరావు, సభ్యులు మురళి సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బాధితురాలికి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని వండవలో తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం మండంగి సత్యవతికి సిఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. పాలకొండ మండలం డోలమడ గ్రామపంచాయతీ వంతవాడ కాలనీకి చెందిన మండంగి ప్రవీణ్ కుమార్ గత ఏడాది మార్చి 2న విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. ఆయన కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి చెక్కు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే కళావతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మిడతాన కల్యాణి, డోలమడ గ్రామస్తులు ఉన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని తుమరాడ, కొండాపురం సచివాలయాలను ఎంపిడిఒ డొంక త్రినాధులు సోమవారం సందర్శించారు. సచివాలయాల సిబ్బందితో మాట్లాడి సంక్షేమ పథకాలు అమలు తీరుపై పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. సచివాలయాల పనితీరు మరింత మెరుగుపడాలన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని జమ్మిడివలసలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60ఏళ్లు, ఆపైబడి వారికి, బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు ఇచ్చారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, షుగర్, బిపి వారికి వైద్య సేవలు అందించారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు ఆరోగ్య వివరాలు అడిగి వారికి కావాల్సిన మందులు ఇస్తూ జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లి రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది ఆనందరావు, సంతోష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో బిల్లుమడలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. దీర్ఘకాలిక, నడవలేని మంచానికి పరిమితమైన రోగు ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలకు వ్యక్తిగత శుభ్రత, హ్యాండ్ వాష్, తదితర వాటిపై అవగాహన కల్పించారు. రక్తపోటు, మధుమేహం, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమం పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఉన్నారు.

దశమంతపురంలో ఫ్యామిలీ

వీరఘట్టం: మండలంలోని దశమంతపురంలో మంగళవారం


వీరఘట్టం : రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ఎస్.తనూజ చంటి పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నవోనమ్మ, ఎఎన్ఎం అశ్విని, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చిన అంటిజోల లో ఫ్యామిలీ పిజిషన్

కురుపాం : మండలంలోని తూర్పుముఠా ప్రాంతమైన గుజ్జువాయి పంచాయితీ చిన్న అంటిజోలలో 104 అధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిసియన్ కన్సెప్ట్ వైద్య అధికారిని బి.ప్రజ్ఞ వైద్య సేవలందించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత, ఆరోగ్యం గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, హెల్త్ విజిటర్, హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రీయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

సమగ్ర సస్య రక్షణ, సేంద్రియ వ్యవసాయ విధానాలు రైతులకు అవగాహన కల్పిస్తూ ఆర్థిక అభివద్ధి చెందడానికి కెవికె శాస్త్రవేత్తలు కృషి చేయాలని పరిశోధన సంచాలకులు ఎం. సురేష్ కుమార్ అన్నారు. మండలంలో రస్తా కుంటు బాయ్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాత్రో ఆధ్వర్యంలో మంగళవారం జరిగినటువంటి 39వ సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెవికె ద్వారా గిరిజన రైతులకు వ్యవసాయ, పెరటి తోటలు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు గూర్చి అవగాహన కల్పించి వారు అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చింతపల్లి నుంచి డాక్టర్ విశాలాక్షి, పి.సీతారాం సీనియర్ శాస్త్రవేత్త సీతంపేట, ఎన్.లక్ష్మీనారాయణ శాస్త్రవేత్త విజయనగరం ఏరువా కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్త కె.తేజేశ్వరరావు సీనియర్ శాస్త్రవేత్త వ్యవసాయ పరిశోధన కేంద్రం విజయనగరం మరియు స్థానిక కె.వి. కె సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కదబవలస పంచాయతీ దువ్వనపాడు, నీలంపేట, రాయమను గూడ, కొత్తగూడ, శాంతి గూడ, ఎలిసిపురం, తదితర గిరిజన గ్రామాల్లో మంగళవారం టిడిపి పాలకొండ నియోజకవర్గం బాధ్యులు నిమ్మక జయకష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయకష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వల్ల రాష్ట్రం పూర్తిగా నాశనం అయిపోయిందన్నారు. అధ్వాన రహదారులతో దర్శనమిస్తున్నాయని, ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు కొండెక్కి కూర్చున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, టిఎన్‌టియుసి నాయకులు ఎన్ శశికుమార్, రాయల దాలమ్మ, గొర్ల రాము, లక్ష్మణ, తోట అప్పలస్వామి, తాతబాబు తదితర గిరిజనులు పాల్గొన్నారు.

ఇ-కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - పాచిపెంట

ఈనెలలో పిఎం కిసాన్, రైతు భరోసా నిధులను విడుదల చేసే అవకాశం ఉందని, ఎవరైతే లబ్ధిదారులు ఇకెవైసి చేయించుకుంటారో వారికి మాత్రమే వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలో ఇంకా ఇకెవైసి చేయించుకోని వారి సంఖ్య 450 మంది ఉండగా, 90 మంది గ్రామాల్లో లేరని, బయట పనుల నిమిత్తం వెళ్లిపోయారని, మరో వంద మంది ఫోన్ నెంబర్ ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేదని, వీరి సంఖ్య ఎక్కువగా తంగలాం, గరిసిగుడ్డి, చిట్టెలబ పరిధిలో ఉందని అన్నారు. వీరంతా తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు అనంతరం ఇ-పంట నమోదు పరిశీలనలో భాగంగా వరి నాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో విఎఎ కిరణ్, వాలంటీర్ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం మంగళవారం తనిఖీలు చేపట్టారు. మండలంలో పరశురాంపురం, విక్రంపురం రైతు భరోసా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆర్‌బికె పనితీరు, ధాన్యం సేకరణ, రైతులకు అందిస్తున్న సేవలు తదితర విషయాలు పరిశీలించామని సింహాచలం చెప్పారు. రైతులతో మాట్లాడి రైతు భరోసా కేంద్రాలు ఏవిధంగా సేవలంది స్తున్నాయి అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ ఉత్తర్వులు మేరకు విజిలెన్స్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలం వ్యవసాయ అధికారి శంకరరావు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అన్నారు. మంగళ వారం గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డుకు సంబంధించిన అన్ని రకాల సేవలు గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉన్నాయని అన్నారు.